క్లుప్తంగా

రుణాల అందజేత



రుణాన్ని మహిళలకు అందిస్తున్న ఎంపీపీ నాగమణి, నరసింహమూర్తి

పెందుర్తి: పీఏసీఎస్ ద్వారా రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తూ సాగును ప్రోత్సహిస్తున్నామని పీఏసీఎస్ అధ్యక్షుడు శరగడం నరసింహమూర్తి అన్నారు. పెందుర్తి కో ఆపరేటివ్ బ్యాంక్ ద్వారా మంజూరైన వివిధ రకాల రుణాలను బుధవారం పంపిణీ చేశారు. పెందుర్తి పీఏసీఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మొత్తం రూ.17.70 లక్షల రుణాలను ఎంపీపీ మధుపాడ నాగమణి, పీఏసీఎస్ అధ్యక్షుడు శరగడం నరసింహమూర్తి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకార రంగానికి సీఎం పెద్దపీట వేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సహకారంతో రానున్న రోజుల్లో పీఏసీఎస్‌ను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. క్యాక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిల్వనీటిని తొలగించండి



అధికారులకు సూచనలిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

పెందుర్తి: వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధికారులను ఆదేశించారు.జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని సాయి సాధనగర్,గొల్లవిల్లివానిపాలెంలో తదితర ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడుతో కలిసి బుధవారం ఆమె పర్యటించారు. 95వ వార్డులో కాలువలు, రోడ్లు సరిగా లేనందున ఇక్కడ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టడానికి ఇప్పటికే టెండర్లు పిలిచామన్నారు. సంబంధిత కాంట్రాక్టర్లు ఆయా పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పలుచోట్ల రోడ్లు, కాలువలు నిర్మించేందుకు అంచనాలు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఇంజినీరింగ్ అధికారులు,శానిటరీ ఇన్ స్పెక్టర్లు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



పంగి రమణ

పెందుర్తి: అల్లూరి జిల్లా హుకుంపేట మండలంలోని బాకూరు గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైనట్లు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదయింది.వివరాలు.. జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఈ నెల 4వ తేదీన హుకుంపేట మండలం నుంచి 21 మంది రోగులను చికిత్స కోసం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తీసుకువచ్చారు. 21 మందిలో పంగి రమణ(52) అనే వ్యక్తి కనిపించడం లేదని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 93090 36353 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097

ముంచెత్తిన వాన



వర్షపు నీటితో కళ కళలాడుతున్న పరవాడ పెద్ద చెరువు

- నిండుకుండల్లా చెరువులు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- పలు గ్రామాల్లో నేలకొరిగిన వరి పంట



తానాం వద్ద కూలిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం



తానాంలో వ్యవసాయ భూముల్లో చేరిన వర్షపు నీరు

పరవాడ: మిచాంగ్ తుపాను ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో చెరువులు, గెడ్డలు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. పరవాడ పెద్ద చెరువు నిండుకుండలా మారింది. నీరు కళింగపై నుంచి పొంగి ప్రవహిస్తోంది.దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల రక్షణ గోడలు కూలి స్వల్ప నష్టం సంభవించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. పరవాడ, తానాం, భర్నికం, రావాడ, వాడచీపురుపల్లి గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పంట నీట మునగిపోవడంతో రైతులు నష్టపోయారు.

నిండుకుండలా పెద్ద చెరువు

మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వచ్చి చేరిన వర్షపు నీటితో పరవాడ పెద్ద చెరువు నిండుకుండలా మారింది. అదనపు నీరు కళింగ పై నుంచి పొంగి ప్రవహిస్తోంది. పెద్ద చెరువులో నీరు చేరడంతో రెండో దఫా వరి పంటకు అనుకూలంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఊర చెరువుకు గండి

భారీ వర్షాలకు పరవాడ ఊర చెరువు గట్టుకు గండి ఏర్పడింది. చెరువులో ఫార్మా రసాయన వ్యర్థాలు బయటకు పంపడానికి స్థానిక రైతులు గతంలో గట్టుకు చిన్న కాలువ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత గట్టును పటిష్టపర్చకుండా వదిలేశారు. ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలకు వచ్చి చేరిన వర్షపు నీటితో గట్టుకు గండి ఏర్పడి మిగిలిన నీరంత వృథాగా పోయింది.

కూలిన ఆలయ రక్షణ గోడ

ఎడతెరిపిలేకుండా పడుతున్న వర్షాలకు పరవాడ పైడిమాంబ ఆలయం వద్ద నిర్మించిన రక్షణ గోడ 20 మీటర్ల మేర బుధవారం కూలిపోయింది. రోడ్డు పక్క నుంచి నిర్మించిన రక్షణ గోడ నానిపోవడం వలన కూలినట్లు చెబుతున్నారు. గండి పడిన ఊర చెరువు, కూలిన రక్షణ గోడలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, మండల ప్రత్యేక అధికారి డైజీ, తహసీల్దారు పి.కనకారావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి, ఏఈ గండి రామారావు, ఉప సర్పంచ్ బి.రామారావు, రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు సందర్శించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



వెంకటాపురంలో కూలిన ఓ ఇంటి రక్షణ గోడ



కూలిపోయిన ఆలయ రక్షణ గోడను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

- తానాం సెక్యూరిటీ పాయింట్ వద్ద భారీ వృక్షం కూలిపోయింది. ఫలితంగా ఉదయం పరిశ్రమలకు వెళ్లే ఫార్మా కార్మికులు ఇబ్బందులు పడ్డారు. పొక్లెయిన్ సహాయంతో చెట్టును పక్కకు తొలగించారు.
- వాడచీపురుపల్లి శివారు వెంకటాపురం గ్రామంలో వర్షాల కారణంగా గొర్లి వెంకటలక్ష్మికి చెందిన ఇంటి రక్షణ గోడ కూలిపోయింది.
- పరవాడ-యలమంచిలి రహదారిలో పరవాడ పైడిమాంబ ఆలయం ఎదురుగా వర్షాలకు వచ్చి చేరిన వర్షపు నీరు రోడ్డు మధ్యలో నిలిచిపోయి చెరువులా మారడంతో వాహన చోదకులు రాకపోకలకు అవస్థలు పడ్డారు.
- తానాం గ్రామంలో మంత్రిరాజు చెరువు గెడ్డ ఆక్రమణలకు గురికావడంతో భారీ వర్షాలు కురిసినప్పుడల్లా వ్యవసాయ భూములు ముంపునకు గురై పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.
- మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయాధికారి చంద్రావతి చెప్పారు. గత మూడు రోజులుగా పడుతున్న భారీ వర్షాల వల్ల 251.8 ఎం.ఎం వర్షపాతం నమోదైందని తెలిపారు. బుధవారం కురిసిన వర్షపాతం అదనమని చెప్పారు.



వర్షాలకు గండిపడిన పరవాడ ఊర చెరువు గట్టు

విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: విజినిగిరిపాలెం వెళ్లే మార్గంలో వరాహ పుష్కరిణి వద్ద ఉన్న కొబ్బరిచెట్లు మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో పడిపోవడంతో విద్యుత్ స్తంభాలు, వైర్లు దెబ్బతిన్నాయి. దీంతో మంగళవారం రాత్రి 11గంటల నుంచి బుధవారం ఉదయం వరకు విజినిగిపాలేనికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరమ్మతులు నిర్వహించి బుధవారం ఉదయం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.



పెద్ద చెరువు కళింగ పైనుంచి ప్రవహిస్తున్న వర్షపునీరు

పెందుర్తిలో కుండపోత



రాజయ్యపేట ప్రాంతాలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

పెందుర్తి: మండలంలోని పలు గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం కురిసిన భారీ వర్షాలతో గ్రామీణ ప్రాంతంలో వరి పంట నీట మునిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని పర్యటించిన జిల్లా యంత్రాంగం పంట నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేసింది. దాదాపు 5 ఎకరాలు పూర్తిగా నీట మునిగిపోగా. 129 ఎకరాల్లో వరిచేను పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. గురువారం మరింత విస్తృతంగా పర్యటించి పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేస్తామని మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్ తెలిపారు.

సరిపల్లిలో అధికం

మండలంలోని సరిపల్లి, నరవలో అత్యధికంగా పంట నీట మునిగింది. సరిపల్లిలో 16.8 హెక్టార్లలో, నరవలో 10 హెక్టార్లలో పంట మునిగిపోగా..ముదపాకలో 4.4 హెక్టార్లు, గొరపల్లిలో 1.2 హెక్టార్లు, లక్ష్మీపురంలో 6 హెక్టార్లు, చినముషిడివాడలో 8 హెక్టార్లు, పెదగాడిలో 2.4 హెక్టార్లు, పెందుర్తిలో 2.8 హెక్టార్లు, రాజయ్యపేటలో 0.8 హెక్టార్లలో పంట పాక్షికంగా, రాంపురం, పినగాడిలో ఒక్కో హెక్టార్లలో పంట పూర్తిగా నీట మునిగినట్లు ఎలమంచిలి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.అప్పలస్వామి, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ బృందం నిర్ధారించింది.

కాజ్ వే పరిశీలన



ఆదిరెడ్డిపాలెం సమీపంలో దెబ్బతిన్న కాజ్‌వేను పరిశీలిస్తున్న అధికారులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం-గుల్లేపల్లి రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు రూ.10 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపడుతున్న తుపాను వల్ల ఆటంకం కలిగింది. కాగా భారీ వర్షాలకు ఆదిరెడ్డిపాలెం సమీపంలో గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో గెడ్డపై నిర్మిస్తున్న కాజ్‌వే దెబ్బతినడంతో గండి కొట్టింది.దీంతో ఆ రోడ్డులో గుల్లేపల్లి మీదుగా ప్రయాణించే వారు ఇబ్బందులు పడ్డారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ సత్యనారాయణతో పాటు ఎంపీడీవో రమేష్ నాయుడు, సీఐ రంగనాథం తదితరులు పరిశీలించారు. ఆ మార్గంలో ప్రయాణించే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించారు. దెబ్బతిన్న రోడ్డును యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్



కృష్ణరాయపురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ ముమ్మన



అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెందుర్తి: బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం జీవీఎంసీ 95వ వార్డు కృష్ణరాయపురంలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కార్పొరేటర్ ముమ్మన దేముడు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ అంబేడ్కర్ మార్గం ప్రతీ ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. పార్టీ నాయకులు అంగటి సూరిబాబు, వేపాడ శ్రీను, ఉమామహేశ్వరరావు, దలాయి శ్రీను, దలాయి లక్ష్మణరావు, కిషోర్, సుంకర శేఖర్, అయిత దేముడు, ముత్యాల సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

- పెందుర్తిలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు డుంబారి రామారావు, ముర్వల వెంకటరమణ, కాకర నూకరాజు, మంతెన అప్పారావు, జె.శ్రీను, ఎం.కుమార్, దోని అప్పారావు, నంబూరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



విశ్వవిద్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు

పరవాడ: స్థానిక బాలికల వసతి గృహంలో ఐద్వా ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ అంబేడ్కర్ దేశంలో అంటరాని తనం వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించడానికి పోరాటం సాగించారన్నారు.



పెందుర్తిలో పండ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి

అంబేడ్కర్‌కు ఘన నివాళి

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి. సూర్యప్రకాశరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ పి. జోగినాయుడు,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

- మండలంలోని మొగలిపురం గ్రామంలో డప్పు కళాకారుల జిల్లా సంఘం అధ్యక్షుడు ఐడీ బాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు.అంబేడ్కర్ ఒక జాతికో,కులానికో నాయకుడు కాదని భారత జాతికే నాయకుడు అని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గండి అరుణ, గండి రవి, బైలపూడి సత్యం,ఎంపీటీసీ సన్యాసమ్మ, డి. ఈశ్వరరావు,ఐ. గోపి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడానికే 'ఆడుదాం ఆంధ్ర'



పార్టీ నాయకులతో కలిసి ఆడుదాం ఆంధ్రా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- క్రీడా కిట్ల పంపిణీ

సబ్బవరం: గ్రామ స్థాయిలో క్రీడాకారులను గుర్తించడంతో పాటు వారిలో పోటీతత్వాన్ని పెంపొందించాలనే సంకల్పంతోనే ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. సబ్బవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆడుదాం ఆంధ్రా బ్రోచర్‌ను ఆవిష్కరించడంతో పాటు క్రీడా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ చాలా మందికి క్రీడల్లో ప్రతిభ ఉన్నప్పటికీ వారు ప్రదర్శించేందుకు వేదికలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారందరికీ ఆడుదాం ఆంధ్రా ద్వారా ప్రభుత్వం ఒక వేదిక కల్పించనుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 వేలు వరకూ సచివాలయాలు ఉన్నాయని, వాటి పరిధిలో ఈ క్రీడా పోటీలు నిర్వహించి వారిలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీయనున్నట్టు తెలిపారు. ప్రధానంగా క్రికెట్,వాలీబాల్,బ్యాడ్మింటన్,ఖోఖో,కబడ్డీ వంటి 5 రకాల క్రీడాంశాల్లో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ స్థాయి క్రీడాకారులను రాష్ట్ర ,జాతీయ స్థాయికి వెళ్లే విధంగా ప్రోత్సహించేందుకు ఈ ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ నియోజకవర్గ ప్రతినిధి కొటాన రాము, జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, పార్టీ నాయకులు బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, సబ్బవరం ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, బోకం స్వామినాయుడు,ఎంపీటీసీ బైలపూడి దేముడు, బోకం బాలకృష్ణ, ఐడీ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు అధికారి శ్రీనివాస్‌కు గురజాడ పురస్కారం



ఉక్కు అధికారి శ్రీనివాస్‌కు పురస్కారం అందజేస్తున్న సినీ గేయ రచయిత చంద్రబోస్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగం సీనియర్ మేనేజర్, ఉక్కు సాహితీ సమాఖ్య సభ్యుడు ఎ. శ్రీనివాసరావు (వినిశ్రీ)కు గురజాడ పురస్కారం లభించింది. గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా విజయనగరం, గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కవితల పోటీలు నిర్వహించారు. శ్రీనివాసరావు రాసిన 'సకారాత్మకం' కవితను గురజాడ ఉత్తమ కవితా పురస్కారానికి ఎంపిక చేశారు. విజయనగరం ఆనంద గజపతి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత, అస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ చేతుల మీదుగా శ్రీనివాస్‌కు అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు పి.వి. నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాశ్, కోశాధికారి డాక్టర్ ఎ. గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోంగార్డ్స్ రైజింగ్ డే



బెస్ట్ హోంగార్డ్ అప్పారావుకు అవార్డు అందజేస్తున్న డీజీఎం సెహగల్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో హోంగార్డ్స్ రైజింగ్ డే ఘనంగా నిర్వహించారు. 61వ హోంగార్డ్స్ రైజింగ్ డేను బుధ వారం స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని హోంగార్డ్స్ బ్యారక్స్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి హెచ్.ఎం. సెహగల్, విశిష్ట అతిథిగా స్టీల్‌ప్లాంట్ హాస్పిటాలిటీ డీజీఎం టిటే హాజరై జెండా ఎగురవేశారు. హోంగార్డులు అందజేసిన గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా సెహగల్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఆస్తుల రక్షణలో హోంగార్డుల సేవలు విశిష్టమైనవన్నారు. టిటే మాట్లాడుతూ శాంతి భద్రతల రక్షణలో పోలీసులకు, ట్రాఫిక్ నియంత్రణలో భద్రతా విభాగానికి హోంగార్డులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా కె. అప్పారావుకు బెస్ట్ హోంగార్డు అవార్డు, ప్రతిభ చూపిన హోంగార్డులు, పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. హోంగార్డ్స్ ఇన్‌చార్జి ఈ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా కోసం దరఖాస్తు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

అగనంపూడి: జీవీఎంసీలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలు ఎక్స్‌గ్రేషియా కోసం జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జీవీఎంసీ వర్కర్స్ యూనియన్ జోన్-6 ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు సూచించారు. 85వ వార్డు అగనంపూడి పెదమడకలో నిర్వహించిన కాంట్రాక్ట్ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ పోరాటం ఫలితంగా ప్రభుత్వం 25 ఉత్వర్వులు జారీ చేసిందని, ఆ ఉత్తర్వులు మేరకు 19.02.2019 తరువాత మృతి చెందిన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల వివరాలు జీవీఎంసీలో రాత పూర్వకంగా తెలియజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్.రాజు, బి.భాస్కర్, సత్యవతి పాల్గొన్నారు.

కార్మికవర్గాన్ని దెబ్బ కొట్టే యత్నమే ప్రైవేటీకరణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని తెర మీదకు తెచ్చారని, కేంద్ర ప్రభుత్వం కుట్రలు పోరాటంతో ఎదుర్కొంటామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 1028వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరు మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com